క్లుప్తంగా

నాడు-నేడు పనులను పూర్తి చేయండి

పులిచెర్ల(కల్లూరు): మండలంలో రెండవ విడతలో మంజూరైన నాడు-నేడు పనులను జూన్12 లోపు పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారి సిద్ధరామయ్య తెలిపారు. పులిచెర్ల ఎమ్మార్సీలో గురువారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండవ విడతలో నాడు-నేడులో మంజూరైన మరుగుదొడ్లు, విద్యుత్, మంచినీటి సౌకర్యం వంటి పనులను జూన్12 (పాఠశాలలు తెరిచే లోపు) పూర్తి చేయాలని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజేంద్ర, ఏఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రంజాన్‌కు ఈద్గా ముస్తాబు



రొంపిచెర్ల: రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు ఈద్గా సిద్ధం అవుతుంది. మండలంలోని 12 మసీదుల నుంచి వేలాది మంది ముస్లింలు ఈద్గాకు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ ఇబ్రహీంఖాన్ ఈద్గాలో పంచాయతీ కార్మికులతో ముళ్ల కంపలను, చెత్తాను గురువారం తొలగించారు. ఈద్గా ఆవరణలోని పరిసరాలను శుభ్రం చేయించారు. ప్రహారీ గోడలను పునర్నిర్మిస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం

రొంపిచెర్ల: రొంపిచెర్ల పంచాయతీ కార్యాలయం సమీపంలో గురువారం చలివేంద్రాన్ని సర్పంచ్ ఇబ్రహీంఖాన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వారపు సంతకు వచ్చే ప్రజలు, రైతుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. తాగునీటితోపాటు మజ్జిగ కూడా ఇస్తున్నామని తెలియజేశారు. కార్యదర్శి నాగరాజ, నాయకులు కరీముల్లా, చిన్న నాగరాజ పాల్గొన్నారు.

అపరిచితుల సమాచారం అందించాలి

బైరెడ్డిపల్లె : గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకట నరసింహులు పేర్కొన్నారు. మండలంలోని లక్కనపల్లె సచివాలయ పరిధిలోని రామనపల్లెలో గురువారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా రాత్రి వేళల్లో అధిక శాతం మంది ఆరుబయట నిద్రిస్తున్నారన్నారు. కిటికీలు, తలుపులకు తాళం వేసి బయట నిద్రపోవాలని తెలిపారు. గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తే ఎప్పటికప్పుడు సమాచారం అందివ్వాలన్నారు. పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సామాజిక తనిఖీ

శాంతిపురం: మండలంలో 2021-2023 మధ్య ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన రూ 20.93 కోట్ల విలువైన పనుల సమాజిక తనిఖీని అధికారులు ముగించారు. గురువారం సాయంత్రం బహిరంగ వేదికలో వివరాలను తనిఖీ బృందం వెల్లడించింది. 2021-22లో రూ 12.80 కోట్లతో, 22-23 ఆర్థిక సంవత్సరంలో రూ 8.13 కోట్ల వ్యయంతో పనులు చేశారు. పంచాయతీలలో నిర్మిస్తున్న సచివాలయాలు, ఆర్బీకేలు, ఇతర భవనాల వ్యయం కూడా ఇందులోనే ఉండటంతో తనిఖీ బృందం వాటిని కూడా పరిశీలించింది. డ్వామా పీడీ గంగాభవాని, ఏపీడీ వెంకటరత్నం, జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ హేమమాలిని, ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఏపీవో అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

రామకుప్పం: మండలంలోని కెంపసముద్రం జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న 100 మంది విద్యార్థుల కు అయ్యప్పగానిపల్లెకు చెందిన శంకర్,బసవేశ్వర్ పరీక్ష సామగ్రిని వితరణగా అందజేశారు. హెచ్ఎం వెంకటరమణ మాట్లాడుతూ కూలీ పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బుతో అట్టలు, పెన్నులు, స్కేళ్లు అందజేసిన దాతల సేవా భావాన్ని అభినందించారు. దాతలను ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ

పలమనేరు: పట్టణానికి చెందిన సమాజ సేవకుడు మోహన్ గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో 30 మంది రోగులకు భోజనం ప్యాకెట్లను అందజేశారు. ఆయనను వైద్యాధికారులు అభినందించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

బైరెడ్డిపల్లె : వైఎస్సార్ కంటి వెలుగులు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాతపేటలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 84 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, పోషకాహారం, రక్తహీనత, చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి విజయ్‌చంద్ర, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



గంగవరం: పర్యావరణ పరిరక్షణపై మదర్‌థెరిసా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మండలంలోని కీలపట్లలో అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా నాలుగు రోజు గురువారం మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. 'మొక్కలు నాటండి, పర్యావరణాన్ని కాపాడండి' అంటూ ర్యాలీ నిర్వహించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

వి.కోట: తమ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. బుధవారం రెండవరోజు మండలంలోని తోటకనుమ పంచాయతీలోని మోర్నపల్లె, పోతనపల్లె, కోటబండ, దండికుప్పం గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొత్తం 484 గృహాలను సందర్శించి సంక్షేమ కార్యక్రమాలు, పథకాల లబ్ధిని వివరించారు. అయన మాట్లాడుతూ పల్లెలే రాష్ట్రానికి పట్టుగొమ్మలని గుర్తించి గ్రామాల్లో మౌలిక వసతులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఎలాంటి అవినీతికి చోటు లేకుండా పథకాలను పారదర్శకంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత ఉండి ఏ పథకమైనా అందలేదా..? అని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ పథకాలన్నీ అందుతున్నాయని, సమస్యలను కూడా మండల కేంద్రానికి వెళ్లి చెప్పాల్సిన అవసరం లేకుండా, వలంటీర్‌కు చెబితే పనులు జరిగిపోతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యేకు తెలిపారు. ప్రజలు విన్నవించిన చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వెంటే ఉన్న అధికారులను ఆదేశించారు. ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ డాక్టర్‌తమీమ్, ఎంపీటీసీ సభ్యుడు హరినాథ్, సర్పంచ్ భాగ్యమ్మ, పీఏసీఎస్ చైర్మన్లు గోపిరెడ్డి, శ్రీరాములురెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కిషోర్, రెస్కో డైరెక్టర్ భూపతి, ఏఎంసీ డైరెక్టర్ మణి, పలువురు నాయకులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని జవ్వనపల్లె పంచాయితీ చింతలగుంటకు చెందిన వార్డు మెంబర్ నాగరాజు తండ్రి రంగప్ప మృతికి ఎమ్మెల్యే సంతాపం వ్యక్తం చేశారు. ఆ గ్రామానికి చెరుకుని రంగప్ప మృతదేహంపై పూలమాల వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు.



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

గంగవరం: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో దావతే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పలమనేరు సమీపంలోని ఎంబీఎస్ ఫంక్షన్ హాల్లో గురువారం నియోజకర్గంలోని మైనారిటీలను ఆహ్వానించి విందు ఇచ్చారు. రంజాన్ శుభాకాంక్షలను తెలిపారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పలమనేరు కన్వీనర్ ఎస్‌కేఎస్ జాఫర్, కౌన్సిలర్ శ్యాం, రహీంఖాన్, మున్సిపల్ చైర్మన్ పవిత్ర, వైస్ చైర్మన్ కమాల్‌బాషా, ముజ్జు, గంగవరం కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, చెంగారెడ్డి పాల్గొన్నారు.



వడ్డిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

పుంగనూరు: తమ ఉద్యోగాలను రెగ్యూలర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి చిత్రపటాలకు గురువారం సచివాలయ ఉద్యోగులు పాలాభిషేకం చేశారు. ఎలాంటి అవినీతి అక్రమాలకు తావులేకుండ సచివాలయ ఉద్యోగాలు ఇచ్చి, పర్మనెంట్ చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీ సెల్ సీమ జిల్లాల ఇన్‌చార్జ్ ఫక్రుద్దిన్‌షరీఫ్, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి మహబూబ్‌బాషా, కౌన్సిలర్ సాజిదాబేగం, జావీద్, తబషీర్, సుల్తాన్‌ఖాజా, ఇర్ఫాన్, ఇమ్రాన్, సుభాన్, షఫివుల్లా, నవాజ్, ఉమ్మర్ తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, నాయకులు

నేడు గడప గడపకు

బైరెడ్డిపల్లె : మండలంలోని గడ్డూరు, కోత్రేపల్లె, ఎం.కొత్తూరు గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు కేశవులు తెలిపారు. అర్హులైన వారికి పథకాలు అందుతున్నాయని, సాంకేతిక కారణాల వలన పథకాలు అందని వారు వినతులు అందజేయవచ్చని పేర్కొన్నారు. సమస్యల వినతులను సమర్పిస్తే ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

ఆపన్నులకు ప్రభుత్వం అండ



సదుం: చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

సదుం: ఆపన్నులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వారు పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన భానుప్రకాష్‌రెడ్డికి రూ.5 లక్షలు, అనిల్‌కుమార్‌కు రూ.75 వేలు, గొంగివారిపల్లెకు చెందిన సునీతకు రూ. 2.50 లక్షల చెక్‌ను అందజేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, మనోహర్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన లబ్ధిదారుల నమోదు ప్రక్రియ

పెద్దపంజాణి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ టి.శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో పథకాల అర్హుల లబ్ధిదారుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వేగవంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మొదటి సారిగా మండలంలోని 19 సచివాలయాల పరిధిలో లబ్ధిదారుల నమోదు ప్రక్రియ యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు తెలిపారు. నవరత్నాలు అమలులో భాగంగా చేదోడు లబ్ధిదారులు 250 మంది, అమ్మఒడి 5100, వైఎస్సార్ చేయూత 2850, వాహన మిత్ర 125, కాపు నేస్తం 175, జగనన్న విద్యాదీవెన 1250, ఈబీసీ నేస్తం 640 మంది లబ్ధిదారుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా 0-5 సంవత్సరాల పిల్లలు, 6-19 సంవత్సరాల పిల్లలు, గర్భిణులు, బాలింతలు వివరాలను నమోదు చేసినట్లు వివరించారు. పలమనేరు డివిజినల్ అభివృద్ధి అధికారిణి కె.ఉమావాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి, తుర్లపల్లి సర్పంచ్ మురళి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లు



పలమనేరు : కూర్మాయిలో నాయకుల ఇంటింటి ప్రచారం



పుంగనూరు: ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కౌన్సిలర్ రేష్మా



పుంగనూరు: కరపత్రాలు అందజేస్తున్న ఫక్రుద్దిన్ షరీఫ్, సాజిదాబేగం

పుంగనూరు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. గురువారం పట్టణంలోని కుమ్మరవీధిలో కౌన్సిలర్ రేష్మాతో కలసి జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. అలాగే రహమత్‌నగర్‌లో మైనారిటీ సెల్ రాయల సీమ జిల్లాల ఇన్‌చార్జ్ ఫక్రుద్దిన్‌షరీఫ్, కౌన్సిలర్ సాజిదాబేగం కార్యక్రమంలో పాల్గొన్నారు. గోకుల్‌వీధిలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, రాజేష్ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. కొత్తపేటలో కౌన్సిలర్ భారతి, మేలుపట్లలో వైస్ చైర్మన్ లలిత కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్లు నటరాజ, జేపీయాదవ్, నరసింహులు, కిజర్‌ఖాన్, రాఘవేంద్ర, సుప్రియ, ఆదిలక్ష్మి ఆయా వార్డులలో పర్యటించారు.

పలమనేరులో విశేష స్పందన

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. సచివాలయాల కన్వీనర్లు, పార్టీశ్రేణులు, గృహసారథులు గురువారం ఇంటిటికి వెళ్లి ప్రజా మద్దతు కోరారు. ఐదు ప్రశ్నలకు సమాధానాలను విని, ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. పట్టణంలోని పలు దుకాణాలవద్ద అందుబాటులోని గృహస్తులను కలిశారు. మున్సిపాలిటీలో కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జిలు, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, చెంగమ్మ, గోపాల్‌రెడ్డి, నరేష్, ప్రసాద్‌రెడ్డి, మహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఆదరించాలి

చౌడేపల్లె: గడ్డంవారిపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌శంకర్ నారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ రుక్మిణమ్మ గురువారం జగనన్నే మా భవిష్యత్తు, మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. సర్పంచ్ భాగ్యవతి, ఎంపీటీసీ శ్రీరాములు, నేతలు మోహన్‌రెడ్డి, హరిబాబు, రెడ్డెప్పరెడ్డి, పెద్దబ్బ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండల కేంద్రంలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు, మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరించారు. సర్పంచ్ వెంకటేష్, వైస్ సర్పంచ్ తబ్రాజ్, సచివాలయ కన్వీనర్ మహేష్, వార్డు సభ్యులు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్నకు తోడుగా ఉందాం

పులిచెర్ల(కల్లూరు): నన్నూరువారిపల్లెలో సర్పంచ్ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. నాయకులు మునస్వామి, రామ్మూర్తి, రఘు తదితరులు పాల్గొన్నారు.

జనరంజక పాలన

సోమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని వైస్ ఎంపీపీ ప్రభాకర, సింగిల్ విండో మాజీ చైర్మన్ మొగిలప్పగారి శ్రీనివాసులు అన్నారు. గురువారం హరిజనవాడలో సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు వసంతమ్మ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్య త్తు-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. నంజంపేటలో సర్పంచ్ వెంకటరెడ్డి, వల్లగట్లలో సర్పంచ్ సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు కల్యాణి, ఆవులపల్లెలో సర్పంచ్ కొదండరాజు, ఎంపీటీసీ సభ్యురాలు అపరాజిత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

కుప్పంరూరల్: మండల పరిధిలోని డీకేపల్లెలో కౌన్సిలర్ మమత విజయ్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధిని వివరించారు. నాయకులు అరుణ్, కదిరప్ప, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పలమనేరులో ఇంటింటి ప్రచారం



చౌడేపల్లె : తెల్లనీళ్లపల్లెలో నాయకుల ప్రచారం



బైరెడ్డిపల్లెలో..



కల్లూరు : నన్నూరువారిపల్లెలో..



సోమల: నంజంపేటలో ..



కుప్పం రూరల్ : డీకేపల్లెలో కరపత్రాల పంపిణీ

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

పలమనేరు: స్థానిక అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఆఖరిరోజు స్థానిక అగ్నిమాపక కేంద్రంలో సిబ్బంది అగ్నిప్రమాదాలపై అవగాహన, తీసుకోవాల్సిన చర్యలలను ప్రజలకు వివరించారు. అనంతరం గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ మనోహరన్, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు అవసరం

పుంగనూరు: అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో గురువారం వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ రెడ్డి, చైర్మన్ అతిథులుగా హాజరయ్యారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణలో సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజలు ముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



పలమనేరు : అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మహాభారత ఉత్సవాలు ప్రారంభం

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెలో శ్రీ ద్రౌపది, ధర్మరాజులస్వామి ఆలయ మహాభారత మహోత్సవాలు బుధవారం ఉదయం అంకురార్పణ, రాత్రి ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. కుప్పం నియోజకవర్గంలోని 86 గ్రామాలకు చెందిన వన్నెకుల క్షత్రియ కులస్తుల ఆధ్వర్యంలో 18 రోజులు మహోత్సవాలను నిర్వహించనున్నారు. రోజూ పగలు హరికథ, రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుంది. గురువారం ఉదంతుని చరిత్ర, భూతరాజు కథ హరికథా గానం అలరించింది. ఉత్సవాల్లో ప్రధానంగా మే 2న అర్జున తపస్సు, రాత్రి పుష్ప పల్లక్కిసేవ, 3న కీచకవధ ఘట్టం , 4న రథోత్సవం, ఆవుల మళ్లింపు, 5న ఇలావంతుని బలి, 6న ధుర్యోధన వధ, రాత్రి అగ్నిగుండం పచ్చిగెరిగె, 7న పట్టాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కాగా అంకురార్పణ పూజల అనంతరం శ్రీధర్మరాజుల విగ్రహం వద్ద కడవపై కత్తిని నిలబెట్టారు. ఉత్సవాలు పూర్తయిన తర్వాత కత్తిని తొలగిస్తారు.



విశేషాలంకరణలో ధర్మరాజస్వామి

ఇలాగేనా పనిచేసేది..?

- సీడీపీఓ, తహసీల్దార్ పనితీరు అధ్వానం
- మండల మీట్‌లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం

శాంతిపురం: ఐసీడీఎస్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆయా శాఖల పనితీరు అధ్వాన్నంగా మారిందని జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల సచివాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, రెవెన్యూ సమస్యలపై సభ్యుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. మాతాశిశు సంరక్షణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నా కుప్పం సీడీపీఓ అరుణశ్రీ నిర్లక్ష్యంతో వృథా అవుతోందన్నారు. సదుపాయాల కల్పనలో అంగన్‌వాడీ కేంద్రాలు వెనకబడ్డాయన్నారు. ప్రజా ప్రతినిధులతో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా వ్యవహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యుల ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిగేలా చూస్తామన్నారు. మొరసనపల్లె అంగన్‌వాడీ వర్కర్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ లోకేశ్వరరావు పనితీరు మెరుగుపరుచుకోకుంటే జిల్లా కలెక్టరుకు సరెండర్ చేస్తామని జెడ్పీ చైర్మన్ హెచ్చరించారు. సభ్యుల నుంచి భారీగా ఫిర్యాదులు రావడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, కొత్త బోర్లు, మోటార్లు వంటి వాటికి ప్రతిపాదనలు పంపితే జిల్లా కలెక్టర్ వెంటనే నిధులు మంజూరు చేస్తారని చెప్పారు.

జరిగిన అభివృద్ధి ప్రజలకు తెలుసు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసని జెడ్పీ చైర్మన్ అన్నారు. కళ్లుండి చూడలేని వారి ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన పని లేదన్నారు. కొత్తగా నిర్మించిన సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, డెయిరీలు, సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో జన్మభూమి కమిటీల పాలన ఇప్పుడు లేదని, సచివాలయాలు, వలంటీర్లతో ప్రజాపాలన సాగుతోందని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్, హెల్‌ఐడీ వంటివి ఆరోగ్యకర సమాజానికి బాటలు వేస్తాయన్నారు. ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ శ్రీనివాసులు, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, కార్పొరేషన్ల డైరెక్టర్లు పెద్దన్న, నాగభూషణమ్మ, ఎంపీడీఓ హేమమాలిని, తహసీల్దార్ లోకేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మునిరత్నంగౌడు, వైస్ ఎంపీపీ పట్టాభి, కో ఆప్షన్ సభ్యుడు నిసార్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులపై సీడీపీఓ అరుణశ్రీని ప్రశ్నిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

ఉపాధిలో రూ.12 లక్షల అవినీతి

- రికవరీకి పీడీ గంగాభవాని ఆదేశం
- కొలతలు సరిగ్గా వేయని అధికారికి షోకాజ్ నోటీసు

రామకుప్పం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా 2021-23 సంవత్సరంలో మండలంలో చేపట్టిన పనుల్లో రూ.12 లక్షల మేరకు అవినీతి జరిగినట్లు అధికారులు వెల్లడించారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయ ఆవరణలో పీడీ గంగాభవాని ఆధ్వర్యంలో సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. 2021-22 సంవత్సరంలో 1,082 పనులకుగానూ కూలీల రూపంలో రూ. 11.95 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.5.02 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా 2022-23 సంవత్సరంలో 1220 పనులకుగానూ కూలీల రూపంలో రూ.6.92 కోట్లు, మెటీరియల్ రూ.4.42 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని పంచాయతీల్లో ఎస్ఆర్‌పీ నాగార్జున ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ అధికారులు గుర్తించిన అంశాలను ప్రజావేదికలో వివరించారు. రూ.12 లక్షలు అవినీతి జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మొత్తం రికవరీతోపాటు 8 వేల జరిమానా విధిస్తూ పీడీ గంగాభవాని ఆదేశించారు. అదేవిధంగా కొలతలు సరిగ్గావేయని అధికారికి షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఎంపీడీఓ రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, ఏపీఓ అనిల్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజావేదిక నిర్వహిస్తున్న పీడీ గంగాభవాని

తీరిన తాగునీటి సమస్య

రొంపిచెర్ల: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జోక్యంతో మండలంలోని బొమ్మయ్యగారిపల్లెలో తాగునీటి సమస్య తీరింది. బొమ్మయ్యగారిపల్లెలో నాలుగు రోజుల కిందట తాగునీటి మోటారు కాలిపోయింది. మోటారును పరిశీలించగా పనికి రాదని మెకానిక్ తెలియజేశారు. కొత్త మోటారు కొనుగోలుకు పంచాయతీలో నిధులు లేక పోవడంతో తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోటా వెంకటరమణ సమస్యను మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కొత్త మోటార్ బిగించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో అధికారులు గురువారం మోటారు బిగించి నీటిని సరఫరా చేశారు. సకాలంలో మంత్రి స్పందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మద్యం సహా వ్యక్తి అరెస్ట్

పుంగనూరు: పెద్ద పంజాణి మండలం గొనివారిపల్లె క్రాస్ వద్ద గంగాద్రి అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, 64 విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మాధవస్వామి తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక దాడుల్లో గంగాద్రిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే కొళత్తూరు వద్ద 70 విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు పరారైనట్లు తెలిపారు. నిందితుడు ఆంజనేయులుగా గుర్తించామన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడు గంగాద్రిని రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో సిబ్బంది శ్రీనాథరెడ్డి, గౌతం, నాగరాజు, దశరథ, నాగరాజ పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

నిబంధనల మేరకే ఇసుక తరలింపు

గంగవరం: ట్రాక్టర్లతో ఇసుకను తరలించాలంటే నిబంధనలు తప్పనిసరని సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలో ఇసుక తరలించే ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లతో గురువారం సమావేశం నిర్వహించి నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇసుకను తరలించాలంటే రవాణా చేసే ట్రాక్టర్ నంబర్‌తో అనుమతి పత్రంతో పాటు డ్రైవర్‌కు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని సూచించారు. ఇవేవీ లేకుండా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్‌ను సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తులు

రామకుప్పం: మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ హరినాథ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో పాఠశాలకు నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజర్వేషన్ల ఆధారంగా విద్యార్థులకు సీటు కేటాయిస్తామని తెలిపారు. వివరాలకు 83094 74388 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

గుడుపల్లె: మండలంలో ఖాళీగా ఉన్న వార్డు గ్రామ వలంటీర్ పోస్టులకు ఈనెల 23వ తేదీ లోపు అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ రమణ తెలిపారు. శెట్టిపల్లె జనరల్ మహిళ 1, కంచిబందార్లపల్లె జనరల్ 1, చీకటిపల్లె జనరల్ 1, యామగానిపల్లె ఎస్సీమహిళ 1, జనరల్ 1, కొడతనపల్లె బీసీ మహిళ 1, ఎస్సీ మహిళ 1, సోడిగానిపల్లె బీసీ ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు వివరించారు.